# ఇది అన్ని రకాలుగానూ మోయలేని బరువు

కె. బాలగోపాల్

ఉత్తరాది నదులలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయికదా, వాటిని దక్షణాదికి పారించి నీళ్లు తక్కువ ఉన్న కృష్ణ, కావేరి, పెన్న బేసిన్లను సస్యశ్యామలం చేయవచ్చునన్న ప్రతిపాదన, దక్షిణాది వారికి వినగానే ఉత్సహం కలిగిస్తుంది.

విన్న క్షణం మాత్రమే కలిగిస్తుంది. కొంచెం ఆలోచిస్తే, దీని బదులు మరొక భగీరధుడు దిగివస్తాడని నమ్మకోవడం మేలనీ అది దీనికంటే అవాస్తవికమైన నమ్మకం కాదనీ అర్థం అవుతుంది.

ఒక సీరియస్ ప్రతిపాదనను ఈ విధంగా వెక్కిరించడం భావ్యం కాదంటారేమో నేను వెక్కిరించడం లేదు, సీరియస్‌గానే అంటూన్నాను.

గంగానదిలోని నీటి ప్రవాహం ఆ బేసిన్ అవసరాన్ని మించి చాలా ఎక్కువ ఉన్నమాట వాస్తవమే. బ్రహ్మపుత్ర సంగతి చెప్పనవసరం లేదు. ఆ అదనపు నీరంతా సముద్రంలోకి పోయే బదులు 'లింక్' కాలువల ద్వారా దక్కన్ పీఠభూమి మీదికీ తూర్పు తీరానికీ ప్రవహించి మహారాష్ట్ర దక్షిణ తెలంగాణ, రాయలసీమ, కర్నాటక, తమిళనాడులలోని కరువు జిల్లాల పొలాలకు నీరు అందించాలని ఆలోచించడంలో సూత్రప్రాయంగా తప్పేమీ లేదు. ఎటొచ్చీదానికి కార్యరూపం ఇచ్చే ప్రతిపాదనలను పరిశీలించినప్పుడే ఈ పథకం విజ్ఞత గురించి సందేహం వస్తుంది.

పాట్నా సమీపంలో బ్యారేజి కట్టి సంవత్సరంలో 150 రోజులు 50 వేల క్యూసెక్కుల నీటిని దక్షిణానికి తరలించవచ్చునని ముప్పైఏళ్ల కింద కె.ఎల్.రావు అంచనా వేసారని చెప్తారు. నిజానికి 60 వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని తరలించే అవకాశం ఉండిగానీ అందులో 10వేల క్యూసెక్కుల ప్రవాహం దక్షిణ బీహార్ అవసరాలకోసం విడిచిపెట్టవలసి వుంటుందనీ మిగిలిన 50 వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని గంగా లోయ నుండి నర్మదలోయలోనికీ అక్కడి నుండి గోదావరి లోయలోనికీ అక్కడి నుండి కృష్ణలోయలోనికీ అక్కడి నుండి కావేరి లోయలోనికీ తరలించవచ్చుననీ ఆయన ఆనాడు ప్రతిపాదించాడు.

ఆనాటి 'దక్షిణబీహార్' ఈనాటి జార్ఖండ్. ఆనాడు అది ఒక వెనుకబడిన రాష్ట్రంలోని వివక్షకుగురయిన ప్రాంతంగా ఉండింది. ఇప్పుడు ఆ వివక్షను అధిగమించడం కోసం వేరుపడి ఒక ప్రత్యేక రాష్ట్రం అయింది. గంగానదీ జలాన్ని దక్షిణానికి తీసుకుపోవడం మొదలుపెడితే వారు అందులో పదివేల క్యూసెక్కుల ప్రవాహంతో సంతృప్తి చెందుతారా? జార్ఖండ్‌లో ప్రతి ఎకరానికీ నీళ్లిచ్చిన తరువాతే నర్మదా బేసిన్‌లోనికి గంగాజలాన్ని పోనిస్తామనివాళ్లు అనరని నమ్మకమేమిటి?

నర్మదా నదిలోయ నుండి గోదావరి లోయలోని వచ్చే లోపల ఛత్తీస్‌ఘడ్, విదర్భ అనే మరి రెండు కరువు పీడిత ప్రాంతాలు మన 'గంగా-కావేరి' కాలవకు తారసపడతాయి. ఛత్తీస్‌ఘడ్ కూడ తన అభివృద్ధికి మధ్యప్రదేశ్‌లో న్యాయమైన ప్రయత్నం జరగడం లేదన్న అభియోగంతో వేరుపడిన రాష్ట్రం. విదర్భ, మహారాష్ట్రమీద అదే అభియోగం పెట్టి వేరుపడడానికి సిద్ధంగా ఉన్న ప్రాంతం. ఈ రెండు ప్రాంతాల అవసరాలను కాదని గంగనీటిని మన పొలాలకు తీసుకురావడం 1970లో సాధ్యమయ్యేదేమోగానీ ఇప్పుడు సాధ్యం కాదు.

అటువంటప్పుడు 'గంగా-కావేరి' లింకు ప్రాజెక్టు మనకు ఇవ్వగల నీరెంత?

ఈ రోజు దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ తమ ప్రాంత అవసరాలగురించి, ప్రయోజనాల గురించి ప్రజలలో స్పృహ పెరిగింది. చైతన్యం పెరిగింది. ఇది కొంత మందికి సంకుచితమైన ప్రాంతీయతత్వంగా కనిపించవచ్చును. ఒక్కొక్కప్పుడు నిజంగానే సంకుచిత రూపం తీసుకోవచ్చును. అయినప్పటికీ ఇది మౌలికంగా సత్పరిణామమే. గంగానది నీటిని దక్షిణాదికి తీసుకొచ్చే ప్రయత్నం అడుగడుగునా ఈ స్థానిక చైతన్యాన్ని ఎదుర్కొంటుంది. దానిని సంతృప్తి పరచక తప్పదు. అటువంటప్పుడు గంగ దగ్గర బయలు దేరిన నీరు నేరుగా గోదావరికి వచ్చేస్తాయనుకోవడం తెలివితక్కువ తనం.

పాట్నాకు దిగువన గంగానదిపైన ఆధారపడిన ప్రజల ప్రయోజనాలకు అవసరమైన ప్రవాహాన్ని ఉండనిస్తూ కూడ పాట్నా దగ్గర 60 వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని పక్కకు మళ్ళించవచ్చునని ఆనాడు కె.ఎల్.రావు అన్నాడు. ఈనాటి స్థానిక చైతన్యం దృష్ట్యా ఈ అంచనా సరయినదేనా? మనదేశం సంగతి ఆలోచించి, పాట్నాకు దిగువన ఉన్న ఫరక్కా బ్యారేజిని దాటిన తరువాత గంగానది బంగ్లాదేశ్‌లోనికి ప్రవహిస్తుంది. ఫరక్కా బ్యారేజి నిర్మాణానికి అనుమతించడమే బంగ్లాదేశ్ ప్రయోజనాలను దెబ్బ తీసిందని ఆ దేశంలోని కొన్ని రాజకీయపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. షేఖ్ హసీనాను ఆ కారణంగా భారత్ ఏజెంట్‌గా వర్ణిస్తున్నాయి. ఇప్పుడు ఫరక్కాకు ఎగువన పాట్నా దగ్గర 60 వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని మనం పక్కకు మళ్లించుకుంటామంటే బంగ్లాదేశ్ ఊరుకుంటుందా? ఇది అంతర్జాతీయ సమస్య అయ్యే ప్రమాదం లేదా?

ఆనాటి కె.ఎల్.రావు పథకాన్నే ఇప్పుడు అమలు చేయబోమనడం ఈ ప్రశ్నలకు జవాబు కాదు. గంగ నీటిని కావేరికి మళ్లించడానికి ఏ పథకాన్ని రచించినా ఈ సమస్యలు రాకతప్పదు.

రెండవది 'లిఫ్టు' సమస్య. గంగా-కావేరి లింకు ప్రాజెక్టులో కనీసం రెండు చోట్ల భారీగా లిఫ్టులు ప్రయోగించాలి. మొదటిది గంగానది లోయ నుండి నీటిని వింధ్య పర్వతశ్రేణలు దాటించి నర్మదా బేసిన్‌లో పడేయడానికి, రెండవది గోదావరి నుండి తెలంగాణ మధ్యభాగాన్ని దాటించి కృష్ణ బేసిన్‌లో వేయడానికి (నర్మదా బేసిన్ నుండి గోదావరి బేసిన్‌కు, కృష్ణాబేసిన్ నుండి కావేరి బేసిన్‌కు లిఫ్టు అవసరం లేకుండా గ్రావిటీ ద్వారానే నీరు ప్రవహించే అవకాశం ఉంది.

ఇందులో మొదటి లిఫ్టు దాదాపు 350 మీటర్లు, రెండవది 150 మీటర్లు ఉంటాయి. అంటే మొత్తం 500 మీటర్ల లిఫ్టు అవసరం ఉంటుంది. సంవత్సరంలో 150 రోజులు 50 వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని 500 మీటర్లు లిఫ్టుచేసి పోసే భారీ విద్యుత్ వ్యవస్థ దీనికి అవసరం.

పరిమాణం సంగతి అటుంచి, దీని ఖర్చు ఎవరు పెట్టుకుంటారు? 1 ఎకరానికి ఆరుతడి పంటకు నీళ్లియ్యడానికి 100 మీటర్లు లిఫ్టు చేసి పోసేటట్టయితే యూనిట్ 2 రూ॥ల రేటు ప్రకారం సంవత్సరానికి 2000 రూ॥ ఖర్చు అవుతుందని అంచనా. 500 మీటర్లు ఎత్తి పోయడానికి ఎకరానికి 10,000 రూ॥లు ఖర్చవుతుంది. ప్రస్తుతం మన ప్రభుత్వాలు ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి కంపెనీల దగ్గర యూనిట్‌కు 3 రూ॥లు (ఇంకా ఎక్కువ కూడ) పెట్టి కరెంటు కొంటున్నాయి కాబట్టి ఆ ప్రకారం లెక్క పెట్టుకుంటే ఎకరానికి 15,000 రూ॥లు ఖర్చువుతుంది.

సాగునీటి కోసం ఎకరానికి 15,000 రూ॥లు ఖర్చుపెట్టగల రైతులు ఎక్కడ ఉన్నారు?

కరెంటు అంత ఖర్చుకాకపోవచ్చుననీ గంగా-కావేరీ కాలువ నుండే మార్గ మధ్యంలో కరెంటు ఉత్పత్తి చేయవచ్చుననీ అది గ్రావిటీ మీద ఆధారపడి జలవిద్యుత్తు కాబట్టి యూనిట్‌కు రూ॥ 1-00 కూడ ఖర్చుకాదనీ ఒకవాదన ఉంది. నర్మదా బేసిన్ నుండి గోదావరి బేసిన్‌కు పోయే దారిలో కొన్ని చోట్ల 'డ్రాప్' చెప్పుకోదగ్గ మోతాదులో ఉన్న కారణంగా అక్కడ విద్యుత్తు ఉత్పత్తి చేయొచ్చు. కానీ దీని పరిమాణం ఎంత ఉండగలదో అంచనా లేదు. ఆ కరెంటును వెనక్కి తీసుకుపోయి గంగా బేసిన్ నుండి వింధ్య పర్వత శ్రేణులపైకి నీటిని లిఫ్టుచేయడానికి వినియోగించేటట్టయితే అయ్యే కరెంటు సరఫరా ఖర్చుఎంత! సరఫరా నష్టం ఎంత అనే అంచనాలేదు. ఒకవేళ అన్నీ లెక్కలోకి తీసుకున్నా ఒక ఎకరానికయ్యే ఖర్చు రూ॥ 15,000 నుండి 10,000 పెట్టుకోగల రైతులు మాత్రం ఎంత మంది ఉన్నారు? 10,000 కాదు, ఎకరానికి 2,000 రూపాయలు సాగునీటికోసం ఖర్చుపెట్టుకొని బతికి బట్టకట్టగల రైతులు తెలంగాణలోనయినా రాయలసీమలోనయినా ఉన్నారా?

కె.ఎల్.రావు తన పథకం రచించిన రోజులలో విద్యుత్ వ్యవస్థ మొత్తం ప్రభుత్వరంగంలో ఉండేది. వ్యవసాయానికీ ఇతర తప్పనిసరి అవసరాలకూ కరెంటు సబ్సిడీ ఇచ్చే సంప్రదాయమూ ఉండింది. ఇప్పుడు విద్యుత్ వ్యవస్థ వేగంగా ప్రైవేటీకరించబడుతున్నది. విద్యుత్ ఉత్పత్తి కనీసం 60 శాతం ప్రైవేటు రంగంలో జరగాలని ప్రపంచబ్యాంకు షరతు. ప్రైవేటు అంటే బహుళజాతి సంస్థలనే అర్థం. విద్యుత్ చార్జీలకు సబ్సిడిలో మొత్తంగా తొలగించి వేయాలన్నది కూడ ప్రపంచ బ్యాంకు షరతులలో ఒకటి. కాబట్టి గంగా-కావేరి లింకు అంటే అర్థం కరువు రైతులు ఎన్‌రాన్ వంటి బహుళజాతి కంపెనీల దగ్గర భారీ మూల్యానికి నీళ్లు కొనుక్కోవడం అని. ఖర్చు సంగతి ఆలోచించి, విదేశీ కంపెనీల వ్యాపార ప్రయోజనాలపైన ఆధారపడక తప్పని పద్ధతిలో కరువు ప్రాంతాల నీటి అవసరం తీర్చడం రాజకీయంగా తెలివయిన పనేనా? బహుళ జాతి కంపెనీల వ్యాపార ప్రయోజనాలనూ అమెరికా రాజ్యం ఆధిపత్య నీతినీ వేరు చేసి చూడగల రోజు లెప్పుడయినా ఉన్నాయేమో గానీ ఇప్పుడు ఆరెండింటి మధ్య విభజన రేఖ లేదని ఇరాక్ యుద్ధం స్పష్టం చేసింది.

ఇంకొక సమస్య కూడ ఉంది. నర్మదా బేసిన్ గోదావరికి వచ్చి చేరే గంగ నీటిని నిలువ చేయడానికి గోదావరి మీద తెలంగాణాలో పెద్ద రిజర్వాయరు నిర్మించాలి. కె.ఎల్.రావు ఇచ్చంపల్లినే సూచించారు. ఇచ్చంపల్లి దగ్గర కాకపోతే దానికి ఇటో అటో బ్యారేజి కట్టవలసి ఉంటుంది. అయితే దీని వల్ల అడవిభూమి, ఆదివాసీ ఆవాసాలు పెద్ద ఎత్తున మునుగుతాయి. 200పైగా ఆదివాసీ ఆవాసాలు మునుగుతాయని అంచనా. మొదటి నుండి ఇచ్ఛంపల్లి ప్రాజెక్టుపట్ల మహరాష్ట్ర, మధ్యప్రదేశ్‌లు ఉత్సాహం చూపకపోవడానికి కారణం ఇదే. మధ్యప్రదేశ్‌లు ఉత్సాహం చూపక పోవడానికి కారణం ఇదే. మధ్యప్రదేశ్ ఒప్పుకొనిది, ఆదివాసుల ప్రయోజనాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వక తప్పని ఛత్తీస్‌ఘడ్ ఒప్పుకుంటుందనుకోవడం అవివేకం అవుతుంది.

గోదావరి జలాలను తెలంగాణ అవసరాలకోసం తీసుకోవడానికి ఎట్లాగూ వరంగల్- కరీంనగర్ సరిహద్దు ప్రాంతంలో ఒక ప్రాజెక్టు కట్టుకోక తప్పదు కాబట్టి అదే ప్రాజెక్టును గంగా-కావేరి లింకు కోసం వాడుకోవచ్చునంటారేమో. అది సరైన అభిప్రాయం కాకపోవచ్చు. గంగాజలం దక్షిణాదికి 365 రోజులురాదు. 150 రోజులు మాత్రం వస్తుందని కె.ఎల్.రావు అభిప్రాయం. గోదావరి

నుండి తెలంగాణ అవసరాలకోసం ఇచ్ఛంపల్లికి దిగువ ఎక్కడి నుండయినా తీసుకునే నీరు 365 రోజులూ అందుబాట్లో ఉంటుంది. దానికి లిఫ్టుద్వారా తీసుకోవడానికి పెద్ద రిజర్వాయరు అక్కర లేదు. చిన్న ఆనకట్ట కట్టి ఎప్పటికప్పుడు లిఫ్టుద్వారా తీసుకోవచ్చు. దేవాదుల (అది అయితే గియితే) ఆ రకమైన ప్రాజెక్టు సంవత్సరంలో సగం రోజులు వచ్చే గంగనీటిని మిగిలిన రోజులలో కూడ . కిందికి తీసుకుపోవాలంటే గోదావరిపైన పెద్ద రిజర్వాయరు కట్టి నీటిని భద్రపరచకతప్పదు. ముంపు కారణంగా అటువంటి ప్రాజెక్టు సాధ్యం కాకపోవచ్చు.

ఎప్పటికప్పుడు చెల్లించవలసిన కరెంటు బిల్లులేకాక, ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే ఖర్చు పెద్ద మొత్తంలో ఉంటుంది. ఈ ఖర్చు కొన్ని వేల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. సాగునీటి కోసం అంత ఖర్చు పెట్టడానికి మన పాలకులు సిద్ధంగా ఉన్నారా? సుప్రీంకోర్టు అదేశించింది. కాబట్టి కొంత హడావుడి చేస్తూన్నారు. ఇప్పుడు దేశాన్ని ఏలుతున్న వ్యవసాయ విధానంలో సాగునీటికి కేంద్ర స్థానం లేదు. వ్యవసాయ వ్యాపారీకరణ, ఎగుమతి మార్కెట్లతో దానిని ముడి పెట్టడం ప్రస్తుత వ్యవసాయ విధానం ప్రముఖ లక్షణం. దానికి ఎంతమేరకు విధానం ప్రముఖలక్షణం దానికి ఎంతమేరకు, ఎక్కడ, ఏ రూపంలో సాగునీరు అవసరమయితే అంతమేరకు మాత్రమే సాగునీటి గురించి మన పాలకులు ఆలోచించదలచుకున్నారు. ఇది ఎక్కువ భాగం నదీజలాల ప్రాజెక్టుల రూపంలోకాక రైతులు స్వంత ఖర్చుతో కల్పించుకునే చిన్న నీటి వనరుల రూపంలో ఉండబోతుంది.

అటువంటప్పుడు భారీగా పెట్టుబడులు అవసరమయ్యే గంగా-కావేరి లింకు ప్రాజెక్టును ప్రభుత్వం తన ఖర్చుతో చేపడుతుందని నమ్మగలమా? ఏదో ఒక బహుళజాతి కంపెనీకి అప్పగించి 'యూజర్ ఛార్జీల' పేరు మీద రైతులనుండే ఆ ఖర్చుతో రాబట్టుకునే ఆలోచన చేయదని నమ్మకమా?

మొదట చర్చించిన సమస్యకు తిరిగివద్దాం. మన రాష్ట్రంలోని భిన్న ప్రాంతాలు పొరుగువారి నీటి అవసరాల కోసం ఒక చుక్కనీల్లు వదులుకోవడానికి సిద్ధంగా లేరని చూస్తూనే, మనం గంగా బేసిన్ వాసులు తమిళనాడు దాకా దక్షిణాన ఉన్న అన్ని ప్రాంతాల కోసమూ గంగనీటిని విడిచి పెడతారని సులభంగా నమ్మేస్తూన్నాం. పులిచింతలలో నిలువ ఉంచడానికి 9 టిఎంసిల నీరు ఉన్నట్టుయితే దానిని ఎగువనున్న కరువు ప్రాంతాలకు కేటాయించాలనీ, పులిచింతలకట్టి కృష్ణా డెల్టాను స్థిరీకరించడానికి అంత ప్రాముఖ్యం ఇయ్యడం అన్యాయమనీ తెలంగాణ వాసులూ రాయలసీమవాసులూ కొన్ని సంవత్సరాలుగా గొడవ చేస్తున్నా పులిచింతలకట్టి తీరుతామన్న పంతాన్ని ఆంధ్రప్రాంతం వారు వదులుకోవడం లేదు. కృష్ణాజలాల గురించి కొత్త ఒప్పందమేదయినా జరిగి ఇంకొంచెం నీళ్లు ఎగువ ప్రాంతానికి దక్కేటట్టయితే దానిని రాయలసీమవాసులతో పంచుకోవడానికి తెలంగాణ వాసులకు మనసొప్పడం లేదు. శ్రీశైలం నుండి ఎస్కేప్‌చానెల్ ద్వారా నియమాలకు విరుద్ధంగా కె.సి.కెనాల్‌కు కృష్ణనీళ్లు తీసుకుంటున్న కర్నూలు-కడప వాసులు ఆ మేరకు తుంగభద్ర నీటిని కె.సి.కెనాల్ నుండి హెచ్.ఎల్‌సికి బదలాయించడానికి అంగీకరించాలన్న అనంతపురం వాసుల కోరికకు స్పందించడం లేదు. రెండు రాష్ట్రాల ఉమ్మడి నది అయిన పెన్న మీద కర్నాటకకు కూడ హక్కు ఉందని ఒప్పుకోవడానికి అనంతపురం వాసులు సిద్ధంగా లేరు. అసలు నదీ జలాల గురించి కర్నాటక ఏం మాట్లాడినా అదంతా అబద్ధమేనన్న ప్రగాఢ నమ్మకాన్ని వదులుకోవడానికి తెలుగు వారెవ్వరూ సిద్ధంగా లేరు.

అయినప్పటికీ గంగా బేసిన్ ప్రజలు 'తమనీటిని' నర్మదా బేసిన్‌కూ తపతి బేసిన్ కూ గోదావరి బేసిన్‌కూ కృష్ణబేసిన్‌కూ పెన్న బేసిన్ కూ కావేరి బేసిన్‌కూ సులభంగా ఇచ్చేస్తారని మనమంతా (మనం గంగా బేసిన్ వాళ్లము కాదు కాబట్టి) సులభంగా నమ్మేస్తున్నాం.

ఇప్పుడు ఈ అలజడి అంతా సుప్రీంకోర్టు ఆదేశం నుండి పుట్టింది. ఈ మధ్యకాలంలో మన కోర్టులు తమకు తెలిసీ తెలియని విషయాలలో ఆర్డర్లు జారీ చేయడం అలవరచుకున్నాయి. బాబ్రీమసీదు స్థలం మీద యాజమాన్యం ఎవరిదో తేల్చమని అలహాబాద్ హైకోర్టును అడిగితే, దానికింద తవ్వి అక్కడ ఎప్పుడయినా రామాలయం ఉండేదేమో చూడమని పురావస్తుశాఖను ఆదేశించింది. అదే విధంగా, కరువు గురించి ప్రభుత్వాలు ఏమీ చేయడం లేదని సుప్రీం కోర్టులో కేసువేస్తే, బ్రహ్మపుత్ర నీల్లు, గంగనీళ్లు దేశమంతా పంచమని ఆ కోర్టు ఆదేశించింది.

కరువు సమస్యనూ దాని పరిష్కారాన్నీ సుప్రీం కోర్టు జడ్జిలలాగ మిడిమిడి జ్ఞానంతో కాక లోతుగా అధ్యయనం చేసినవారు ఉన్నారు. వర్షం నీటిని, ఉపరితల జలాలను భూగర్భజలాలను, పర్యావరణాన్ని ధ్వంసం చేయని రీతిలో ఉపయోగించుకుంటూ అందరి నీటి అవసరాలూ సమానంగా తీర్చుకోవడం సాధ్యమే! ఆకాశమంత పెద్ద ప్రణాళికలు తయారుచేసి రైతుల నడ్డి విరచవలసిన పనిలేదు. మన వ్యవసాయరంగం భవిష్యత్తును మన నియంత్రణలో లేని శక్తుల చేతిలో పెట్టనవసరం లేదు. కేంద్రీకృత వ్యూహాలు రచించి స్థానిక ప్రజాసమూహాల మధ్య చిచ్చుపెట్టనవసరం లేదు.